సాక్షి పల్నాడు

శుక్రవారం । 18 । ఏప్రిల్ । 2025



అగ్ని ప్రమాదాలపై అవగాహన

నరసరావుపేట టౌన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం పలు పాఠశాలల్లో విద్యార్థులకు స్థానిక అగ్నిమాపక శాఖ అధికారి ఎంవీ సుబ్బారావు అవగాహన కల్పించారు.



సాగర్ నీటి మట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటి మట్టం గురువారం 515 అడుగుల వద్ద ఉంది. ఇది 140.3150 టీఎంసీలకు సమానం.



బీచ్ కబడ్డీ పోటీలకు ఏర్పాట్లు

మంగినపూడి(మచిలీపట్నం రూరల్): స్థానిక బీచ్‌లో మే నెలలో జరగబోయే కబడ్డీ పోటీలకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్పోర్ట్స్ అథారిటీ బృందం, అధికారులు గురువారం వాటిని పరిశీలించారు.

వైద్యంపై కూటమి చోద్యం

చేతిలో చిల్లిగవ్వ లేక.. ఒంట్లో ఓపిక లేక.. శరీరంలో రోగం తగ్గక 'అయ్యా .. మీరే దిక్కంటూ' నరసరావుపేట ఏరియా ఆస్పత్రి తలుపును ఎవరైనా తడితే అక్కడ దౌర్భాగ్య పరిస్థితులు మరింత వెక్కిరిస్తున్నాయి. మంచంపై సొమ్మసిల్లితే విరిగిన ఫ్యాన్ల రెక్కలు ఉసూరుమంటున్నాయి. ముక్కు మూసుకుని మరీ మరుగుదొడ్ల వైపు వెళితే నీళ్లు లేని కుళాయిలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. అర్ధరాత్రి వేళ కడుపు నొప్పంటూ రోగి విలవిల్లాడుతుంటే ఆలకించే సిబ్బంది లేరు. పది నెలల కూటమి పాలనలో కనీస వసతులు లేక రోగులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వాస్పత్రి అంటే కూటమి సర్కారు నిర్లక్ష్యానికి అద్దం పట్టేలా ఉంది.

- ప్రభుత్వాస్పత్రిలో అందని వైద్య సేవలు
- తిరగని ఫ్యాన్లు, నీళ్లు లేని మరుగుదొడ్లు
- సిబ్బంది కొరతతో అరకొర వైద్యం
- సీటీ స్కాన్ మిషన్ లేక సిఫార్సులతో సరి
- పది నెలల పాలనలో అంతా అస్తవ్యస్తం
- కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంపై మండిపడుతున్న రోగులు, సహాయకులు



నరసరావుపేటలోని ఏరియా వైద్యశాల

నరసరావుపేట టౌన్ : పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు సేవల కోసం వచ్చే రోగుల పరిస్థితి దయనీయంగా మారింది. ఈ వైద్యశాలకు రోజు పల్నాడు జిల్లాతోపాటు బాపట్ల, ప్రకాశం జిల్లాల నుంచి రోగులు వస్తుంటారు. ప్రతిరోజు 1,000 - 1,200 మంది ఓపీ నమోదు చేసుకుంటున్నారు. కూలీనాలీ చేసుకుని బతికే పేదోళ్లు ఇక్కడికి వచ్చాక వసతుల లేమితో నానా అవస్థలు పడుతున్నారు. ఉన్న రోగం పోతుందో లేదో తెలియదుగానీ... కొత్త రోగం మాత్రం వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మరో వైపు సిబ్బంది కొరతతో రోగులకు కనీసం సమాధానం చెప్పే వారు కరవయ్యారు.

వేధిస్తున్న స్టాఫ్ నర్సుల కొరత

ఈ వైద్యశాలకు 40 మంది స్టాఫ్ నర్సులు ఉండాలి. ప్రస్తుతం 16 మంది మాత్రమే ఉన్నారు. వీరితో ఎలా సేవలు అందించాలో అర్థంగాక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది కొరతపై ఆరు నెలల క్రితం డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్‌కు లేఖ రాశారు. సరిపడా సిబ్బందిని కేటాయించాల్సిందిగా కోరారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన రాలేదు. ఉన్న సిబ్బందికీ పని ఒత్తిడి కారణంగా విధుల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆ ప్రభావం రోగులపై తీవ్రంగా పడుతోంది.

కనీస వసతులూ కరవే...

వైద్యశాలలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. మరుగుదొడ్ల వద్ద దుర్వాసన వస్తోంది. గతంలో వంద పడకలుగా ఉన్న ఆస్పత్రిని 200 పడకలకు పెంచారు. శానిటేషన్ సిబ్బందిని మాత్రం పెంచలేదు. దీంతో ప్రభుత్వాస్పత్రి పరిసరాల్లోకి అడుగు పెట్టాలంటే ముక్కు మూసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. రోగంతో ఆస్పత్రిలో అడుగుపెడితే రోగితోపాటు సహాయకులకు కూడా కొత్త వ్యాధులు వస్తున్నాయని బాధితులు వాపోతున్నారు.



జనరల్ వార్డులో కింద పడి ఉన్న రోగి (ఫైల్)

చొరవ చూపని అధికారులు

వైద్యశాలలో సీటీ స్కాన్ పరికరం అందుబాటులో లేదు. రోడ్డు ప్రమాదాల కేసులు ఇక్కడకు అధికంగా వస్తుంటాయి. అధిక శాతం తల భాగంలో తీవ్ర రక్త గాయాలైనవే ఉంటాయి. వైద్య సేవ అందించాలంటే సీటీ స్కాన్ అవసరం. అది అందుబాటులో లేకపోవడంతో కేసులను గుంటూరుకు పంపుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకున్న దాత సీటీ స్కాన్ యంత్రం అందజేస్తామని ముందుకొచ్చారు. కానీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

ఐసీయూ ఉన్నా నిరుపయోగమే ..

సిబ్బంది లేని కారణంగా ఐసీయూ ఉన్నా ఉపయోగం లేకుండా పోయింది. ఐసీయూ విభాగాన్ని ఏర్పాటు చేసి పది పడకలను సిద్ధం చేశారు. వెంటిలేటర్లు కూడా ఉన్నాయి. టెక్నీషియన్లు లేక ప్రయోజనం లేకుండాపోయింది. టెక్నీషియన్లు కావాలని ప్రభుత్వాన్ని కోరినప్పటికీ నియమించలేదు. పాయిజన్ కేసులను గుంటూరుకు పంపించాల్సి వస్తోంది.

రోగులపై ఆర్థికభారం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత హాస్పిటల్ అభివృద్ధి కమిటీని ఇటీవల ఎన్నుకున్నారు. హెచ్‌డీఎస్ నిధులతో ఆసుపత్రికి అవసరమైన మౌలిక సౌకర్యాలు, అత్యవసరమైన మందులు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈ నిధులను ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వినియోగిస్తారు. తొమ్మిది నెలలుగా రోగులకు వైద్య సేవలు, సరిపడా మందులు లేకపోయినా కమిటీ లేకపోవడంతో పట్టించుకోలేదు. సేవల కోసం వచ్చిన రోగులు బయట మందులు కొనుక్కోవడం, పరీక్షల కోసం ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లకు వెళ్తూ ఆర్థిక భారాన్ని మోశారు.

సెలైన్ సీసా తీసే వారూ లేరు



విరేచనాలతో బాధపడుతూ ఏరియా వైద్యశాలలో చేరాను. నీరసంగా ఉండటంతో సెలైన్ ఎక్కించారు. బాటిల్ పూర్తయినప్పటికీ తొలగించేందుకు సిబ్బంది రాలేదు. వారికోసం వెతికినా అందుబాటులో లేరు. చివరకు స్వయంగా నీడిల్‌ను తీసుకోవాల్సి వచ్చింది. పేదలకు మెరుగైన వైద్యం అందుతుందని ప్రభుత్వాసుపత్రికి వస్తే ఇక్కడ పరిస్థితి మరీ దారుణంగా ఉంది.

– ఎలిషా, వెల్లలచెరువు, సంతమాగులూరు మండలం, బాపట్ల జిల్లా

సిబ్బంది కొరతపై నివేదిక



వైద్యశాలలో సిబ్బంది కొరతను ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలోనే భర్తీకి చర్యలు తీసుకుంటాం. పారిశుద్ధ్య సిబ్బంది కాంట్రాక్ట్ పూర్తయిన కారణంగా కొత్త వారిని ఇంకా నియమించలేదు. కొత్త కాంట్రాక్ట్‌లో సిబ్బంది పెంపునకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

– డాక్టర్ సురేష్ కుమార్, సూపరింటెండెంట్, ఏరియా వైద్యశాల

గ్రామాల్లో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు

మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



వినుకొండ: గ్రామాల్లో రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా దాడులు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. బుధవారం ఈపూరు మండలం కొచ్చర్ల గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై జరిగిన దాడిని ఆయన ఖండించారు. టీడీపీ నాయకుల దాడిలో గాయపడి ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న లక్కిశెట్టి బుచ్చమ్మ, రాగాల భువనేశ్వరిలను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చిన తర్వాత రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు పరుస్తూ పోలీసుల ద్వారానే అక్రమ కేసులు బనాయించడం, అర్ధరాత్రి అరెస్టులు చేయడం, బెదిరింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అవసరమైతే న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రోద్బలంతోనే ఈ దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. వీటికి ఎవరూ భయపడరని, ఎదురు తిరిగే రోజు వస్తుందన్నారు. మహిళలని చూడకుండా దాడి చేసి కాలు విరగ్గొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతకన్నా దారుణం ఎక్కడుందని కూటమి పాలకులను నిలదీశారు. చిన్న గొడవలు జరిగినా హత్యాయత్నం కేసులు నమోదు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు చెప్పారు. టీడీపీ కార్యకర్తలకు ఎలాంటి దెబ్బలు తగలకపోయినా 307 కేసు నమోదు చేయడం ఏంటని ప్రశ్నించారు. ఈ దాడులను ఖండించాల్సింది పోయి ప్రోత్సహించడం ఎమ్మెల్యేకు తగదని హితవు పలికారు. ఇలాంటి రాజకీయాలు మానుకొని ప్రజలకు రక్షణగా ఉండాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే వెంట పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

న్యూస్‌రీల్

'గురుకుల' ప్రవేశానికి 19 వరకు దరఖాస్తు గడువు



రెంటచింతల: స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో వివిధ తరగతులలో ఇంగ్లిష్ మీడియంలో 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రవేశాల కోసం బాలురు ఈ నెల 19వ తేదీలోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ సింహాద్రి మోహన్ కోరారు. గురువారం పాఠశాలలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఖాళీలను తరగతులవారీగా రోస్టర్ విధానంలో భర్తీ చేస్తామన్నారు. 5వ తరగతిలో 40, 6వ తరగతిలో 10, 9వ తరగతిలో 9 ఖాళీలు ఉన్నాయని చెప్పారు. బ్యాక్‌లాగ్ సీట్లు కేవలం ఎస్టీ విద్యార్థులకు మాత్రమేనని తెలిపారు. ప్రవేశ పరీక్ష ఈ నెల 20వ తేదీన పాఠశాలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుతోపాటు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ నకలు, రెండు పాస్‌పోర్టు ఫొటోలు, రేషన్‌కార్డు జిరాక్స్‌ను జత చేసి పాఠశాలలో అందించాలని కోరారు.

క్రీడా శిక్షణ కోర్సులకు దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట ఈస్ట్: భారత క్రీడా ప్రాధికార సంస్థ నేతాజీ సుభాష్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ (పటియాల) ఆధ్వర్యంలో ఎంఎస్సీ స్పోర్ట్స్ కోచింగ్, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమో కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ స్పోర్ట్స్ కోచింగ్ (2025–27), పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమో కోర్సులు (2025–26), అకడమిక్ సెషన్ 2025–27 విద్యా సంవత్సరాలకు సంబంధించి స్పెషలైజేషన్‌లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మే నెల 2వతేదీ లోగా httpr://www.rrc.nmir.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేటి నుంచి మిర్చి యార్డుకు వరుస సెలవులు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం నుంచి వరుసగా మూడు రోజులపాటు సెలవులు ప్రకటించారు. శుక్రవారం గుడ్ ఫ్రై డే, శని, ఆదివారాలు సాధారణ సెలవులు ఇచ్చినట్టు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలవు రోజుల్లో రైతులు తమ సరకును యార్డుకు తీసుకురావద్దని కోరారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సరకును యార్డులోకి అనుమతిస్తామని పేర్కొన్నారు. సోమవారం నుంచి యథావిధిగా క్రయవిక్రయాలు కొనసాగుతాయని వివరించారు.

1,58,818 బస్తాలు మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,39,333 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,58,818 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.13,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.9,800 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.6,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 57,411 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

శావల్యాపురం తహసీల్దారు సస్పెన్షన్

శావల్యాపురం: విధుల్లో అలసత్వం వహించడంతోపాటు పలు ఆరోపణల నేపథ్యంలో మండల తహసీల్దార్ కె.సుజాతను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలో జరుగుతున్న రెవెన్యూ వ్యవహారాలపై పత్రికల్లో కథనాలు వచ్చిన నేపథ్యంలో వీటిపై విచారణాధికారిగా నరసరావుపేట ఆర్డీవో కె.మధులతను ఆయన నియమించారు. ఆర్డీవో విచారణకు వచ్చిన సమయంలో కూడా తహసీల్దార్ సుజాత సమయపాలన పాటించలేదు. ఫిర్యాదుదారులు చెప్పిన అంశాలను ఆర్డీవో నమోదు చేసుకొని నివేదికను జిల్లా కలెక్టరుకు అందజేశారు. దీంతో ఆమెను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్ విషయాన్ని ఆర్డీవో కె.మధులత ధ్రువీకరించారు. మండలం నూతన తహసీల్దారుగా అర్జున్‌నాయక్ నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం రెంటచింతల మండల తహసీల్దారుగా విధులు నిర్వర్తిస్తున్నారు.

గురుశిష్యుల అనుబంధం వెలకట్టలేనిది



అకాడమీ డైరెక్టర్ ఎం.బాలలతను సత్కరిస్తున్న విద్యార్థులు

ఏఎన్‌యూ(గుంటూరు): గురుశిష్యుల అనుబంధం వెల కట్టలేనిదని హైదరాబాద్‌లోని సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ ఎం.బాలలత అన్నారు. వర్సిటీలో గురువారం జరిగిన వార్షికోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత విలువలతో సమాజంలో బాధ్యతాయుతంగా ఆదర్శవంత జీవనాన్ని సాగించాలన్నారు. ప్రతిభతోపాటు స్థిరత్వం ముఖ్యమని సూచించారు. వ్యక్తి తలచుకుంటే ఒక వ్యవస్థగా మారి, ఒక గొప్ప శక్తి కాగలడని పేర్కొన్నారు. గౌరవ అతిథిగా ముఖ్యమంత్రి కార్యాలయ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ అధికారి చిటికెల చిన్నారావు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె.గంగాధర రావు మాట్లాడుతూ విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, కృత్రిమ మేధ ప్రాముఖ్యాన్ని తెలుసుకోవాలని చెప్పారు. వార్షికోత్సవానికి ఏఎన్‌యూ ఆర్ట్స్, కామర్స్, లా కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం.సురేష్ కుమార్ అధ్యక్షత వహించారు. తర్వాత బాలలతను సత్కరించారు. అనంతరం రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, వీసీ ఆచార్య కె. గంగాధరరావుతోపాటు పలువురిని సన్మానించారు. రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు పొందిన వర్సిటీ ప్రొఫెసర్లు ఎం.త్రిమూర్తిరావు, వై.అశోక్ కుమార్, ఎస్.వి.కృష్ణారావు, పూర్ణచంద్రరావులను వర్సిటీ వీసీ, రెక్టార్, రిజిస్ట్రార్, ఓఎస్‌డీ తదితరులు సత్కరించారు. కార్యక్రమానికి ఎం. త్రిమూర్తిరావు, సీహెచ్ లింగరాజు, డాక్టర్ రవి శంకర్ రెడ్డి కన్వీనర్లుగా వ్యవహరించారు. కార్యక్రమంలో పూర్వ ఐఏఎస్ అధికారి ఆంధ్రప్రదేశ్ దూరదర్శన్ విభాగాధిపతి డాక్టర్ జి. కొండలరావు, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ వీరయ్య, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ప్రమీల రాణి పాల్గొన్నారు. అనంతరం దివ్యాంగ కళాకార స్వర నేత్ర బృందం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జానపద గాయకులు దామోదర గణపతి రావు బృందం పలు గీతాలను ఆలపించింది. చలనచిత్ర గాయకురాలు సాయి శిల్ప సినీ గీతాలతో అలరించారు. వర్సిటీలోని డ్యాన్స్ విభాగం విద్యార్థులు శాస్త్రీయ, పాశ్చాత్య నృత్యాలతో ఆకట్టుకున్నారు. పోటీల్లో విజేతలైన విద్యార్థులకు, బృందాలకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు.



విద్యార్థుల సాంస్కృతిక నృత్యం

కృష్ణా నదిలో మునిగి ఇద్దరు యువకులు మృతి

సురక్షితంగా బయటపడ్డ మరో ముగ్గురు

రేపల్లె రూరల్: పెనుమూడి వద్ద కృష్ణా నదిలో మునిగి ఇరువురు యువకులు మృతి చెందిన సంఘటన గురువారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... భట్టిప్రోలు మండలం వేమవరం గ్రామానికి చెందిన 30 మంది గ్రామస్తులు ఆటోలో రేపల్లె మండలం పెనుమూడి వద్ద కృష్ణా నదికి చేరుకున్నారు. మతమార్పిడి కోసం ముగ్గురు రాగా వారి వెంట కుటుంబ సభ్యులు తరలివచ్చారు. వారిలో సరదాగా ఈత వేసేందుకు ఐదుగురు నదిలో దిగి నీట మునగగా గమనించిన స్థానికులు ముగ్గురిని సురక్షితంగా ఒడ్డుకు తీసుకువచ్చారు. మిగిలిన ఇద్దరిని నదిలో గాలించి కొంత సేపటికి ఒడ్డుకు తరలించారు. కొన ఊపిరితో ఉన్న ఇరువురు యువకులను అంబులెన్స్‌లో రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మార్గంలో ఒక యువకుడు మృతి చెందగా చికిత్స పొందుతూ మరో యువకుడు మృతి చెందాడు. గుంటూరులో ఇంటర్ పూర్తి చేసిన తలకాయల గౌతం (18), పొన్నూరులో పాలిటెక్నిక్ పూర్తి చేసిన పెనుమాల దేవదాసు (19)లు మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పట్టణ సీఐ మల్లికార్జునరావు, తహసీల్దార్ శ్రీనివాసరావులు ప్రభుత్వ వైద్యశాలకు చేరుకొని మృతదేహాలను పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మల్లికార్జునరావు తెలిపారు.



మృతి చెందిన గౌతం , దేవదాసు

జై చెన్నకేశవ.. జై జై చెన్నకేశవ..

- కనుల పండువగా శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి రథోత్సవం
- వేడుక ఆద్యంతం పులకించిన భక్త జనసందోహం

మాచర్ల రూరల్: పల్నాడు ప్రజల ఆరాధ్య దైవం, భక్తుల కొంగుబంగారంగా పిలుచుకునే శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. వేలాది తరలివచ్చిన భక్తజన సందోహంతో కనుల పండువగా వేడుక జరిగింది. తొలుత శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి రథంపైకి చేర్చారు. కుమ్మరి వారు కుంభం పోసి హారతి ఇచ్చి రథం ఊరేగింపునకు సిద్ధం చేశారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి – శోభారాణి దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రథం ఊరేగింపును ప్రారంభించారు. రథంపై నగారా మోగిస్తూ జై చెన్నకేశవ.. అంటూ భక్తులు రథాన్ని పురవీధుల్లో లాగేందుకు పోటీ పడ్డారు. రథశాల నుంచి లక్ష్మీదేవి మిద్దెల మీదుగా బురుజు సెంటర్ వరకు జై చెన్నకేశవ, జై జై చెన్నకేశవ.. నినాదాలు మార్మోగాయి. గోవింద నామ స్మరణతో రథోత్సవం అత్యంత వైభవంగా కొనసాగింది. ఆలయ ప్రధాన అర్చకులు అడిగొప్పల రాజగోపాలాచార్యులు శాస్త్రోక్తంగా స్వామి వారికి పూజ నిర్వహించారు. ఈఓ పూర్ణచంద్రరావు పర్యవేక్షణలో వేడుక సాగింది. రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పల్నాటి ప్రాంతం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా వేల సంఖ్యలో తరలి వచ్చారు. స్వామిని దర్శించుకుని భక్తి పారవశ్యంతో పులకించిపోయారు. స్వచ్ఛంద సేవా సంస్థలు భక్తులకు మజ్జిగ, పులిహోర, పానకం, కూరగాయల మార్కెట్‌లో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించాయి. అడిషనల్ ఎస్పీ జె.సంతోష్, సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావుల నేతృత్వంలో పట్టణ సీఐ పచ్చిపాల ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి రథం ఊరేగింపులో పాల్గొన్న భక్త జన సందోహం

21న పేటలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని టౌన్‌హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు గురువారం పేర్కొన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడంలో భాగంగా నరసరావుపేటను ఎంపిక చేశామన్నారు. సాధారణంగా కలెక్టరేట్‌లో జరిగే పీజీఆర్ఎస్ వేదిక మార్పును ప్రజలు గమనించాలని సూచించారు. ఏప్రిల్ మొదటి వారంలో చిలకలూరిపేట పట్టణంలో తొలిసారిగా నియోజకవర్గ స్థాయిలో ఈ కార్యక్రమం నిర్వహించామని గుర్తుచేశారు. ప్రజలు, ప్రజా ప్రతినిధుల నుంచి స్పందన వచ్చిందన్నారు. 300 వరకు వినతులు అందాయని చెప్పారు.

సమీక్షకు హాజరైన కలెక్టర్, ఎస్పీ

గురువారం విజయవాడ ఏపీ సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాలు నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ నిర్వహించిన వీసీకి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఉచిత ఇసుక సరఫరా, సౌరవిద్యుత్ ప్రాజెక్టులకు భూసేకరణ, వేసవి నేపథ్యంలో సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను నింపేందుకు ప్రణాళిక, తాగునీటి సరఫరా, ఎంఎస్ఎంఈ సర్వే, నియోజకవర్గాలలో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్ష జరిగింది.



సమీక్షకు కలెక్టరేట్ నుంచి హాజరైన కలెక్టర్, ఎస్పీ, అధికారులు

మండలాల్లో 'ఈ–వేస్ట్' సేకరణ కేంద్రాలు

నరసరావుపేట: జిల్లాలోని అన్ని మండలాల్లో ఈ–వేస్ట్ సేకరణ కేంద్రాలను ఈ నెల 19వ తేదీ నిర్వహించబోయే 'స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం నాటికి ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలతో కలెక్టర్ గురువారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ–చెక్ అనే అంశాన్ని ప్రభుత్వం నిర్దేశించిందని, దానికి అనుగుణంగా కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. 13 శాఖలు భాగస్వాములు కావాలని, నిర్వర్తించాల్సిన విధులు, చేపట్టాల్సిన అంశాలను వివరించారు. గ్రామ, వార్డు స్థాయిల్లో జరిగిన కార్యక్రమాలను సైతం యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. వాటి ఆధారంగానే జిల్లాకు ర్యాంకింగ్ వస్తుందని తెలిపారు. చారిత్రక ప్రదేశాలు, దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలు, ఆసుపత్రులు, మార్కెట్లు, పట్టణ కేంద్రాలను పరిశుభ్రం చేయాలని చెప్పారు. ఎన్‌జీఓలు, యువత, సామాన్య ప్రజలను సైతం పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలని అన్నారు. పట్టణాలు, మండలాల్లో ఈ–వేస్ట్ సేకరణ కేంద్రాలను మహిళా స్వయం సహాయక సంఘాలే నిర్వహిస్తాయని చెప్పారు. దీనికోసం సభ్యులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. రెడ్యూస్, రీసైకిల్, రీయూజ్‌పై దృష్టి పెట్టాలని చెప్పారు. వాట్సాప్ గవర్నెన్స్‌పై దృష్టి పెట్టి తగిన ప్రాచుర్యం కల్పించాలని కోరారు. పీజీఆర్ఎస్ వినతులను అర్జీదారుడు సంతృప్తిపడేలా పరిష్కరించాలని చెప్పారు. అప్పుడే వారి నుంచి ప్రభుత్వానికి సరైన ఫీడ్ బ్యాక్ వస్తుందని స్పష్టం చేశారు. పింఛన్ సమస్యలను పరిష్కరించేందుకు సచివాలయ సిబ్బంది కృషి చేయాలని కోరారు.

క్లుప్తంగా

కందిరీగల దాడిలో 15 మందికి గాయాలు

బాపట్ల :బాపట్ల పట్టణంలోని సూర్యలంక రోడ్డులో గాయత్రీ అపార్టుమెంటు సమీపంలో కందిరీగలు దాడిలో 15 మందికి గాయాలయ్యాయి. మధ్యాహ్నం సమయంలో కందిరీగలు ఒక్కసారిగా పైకిలేచి ఆ ప్రాంతంలో వెళ్లే వారిపై దాడి చేశాయి. దాడిలో 15 మందికి గాయాలు కాగా వీరు ప్రభుత్వ వైద్యశాల్లో చికిత్స పొందుతున్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీలో అవకాశం

బాపట్ల: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీల్లో బాపట్ల జిల్లాకు చెందిన పలువురికి అవకాశం కల్పిస్తూ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శి, జాయింట్ కార్యదర్శులుగా మాచవరపు రవికుమార్, షేక్ ఫర్‌వీజ్, రాష్ట్ర క్రిష్టియన్ మైనార్టీ విభాగం కార్యదర్శిగా ఇమానియేల్ రీభాలను ఎంపిక చేశారు. వీరు ఎంపికైన పలువురు అభినందనలు తెలిపారు.

తప్పిన ప్రమాదం



చీరాల: జాతీయ రహదారిపై పెనుప్రమాదం తప్పింది. గురువారం చిన్నగంజాం నుంచి చెరుకుపల్లి మండలం పొన్నపల్లికి కుటుంబంతో కలసి ఆటోలో వెళుతుండగా చీరాలలోని జాతీయ రహదారిలో టీడీపీ కార్యాలయం వద్ద నీరు తాగేందుకు ఆటో నిలిపారు. అదే మార్గంలో వేరుశనగ లోడుతో వస్తున్న మినీ లారీ రోడ్డు పక్కన ఆగి ఉన్న ఆటోను ఢీ కొట్టింది. దీంతో ఆటో వేగంగా పక్కనే ఉన్న పంట కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న నలుగురు పెద్దలు, ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. ఈ ఘటనలో అందరూ ప్రాణాలతో బయటపడడంతో పెను ప్రమాదం తప్పింది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



బాపట్ల టౌన్: ఇటీవల బాపట్ల పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ప్రైవేటు టికెట్ బుకింగ్ కౌంటర్ వద్ద జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడిన రిటైర్డు రైల్వే ఉద్యోగి తులబందుల లక్ష్మీ నారాయణ(65) గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. లక్ష్మీనారాయణ, నల్లమోతు మాధవి గుంటూరులోని వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. నల్లమోతు మాధవి బుధవారం మృతి చెందగా లక్ష్మీనారాయణ గురువారం మృతి చెందారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వీరిరువురు జీవితాలు విషాదం కావటంతో వారి బంధువుల్లో విషాదం నెలకొంది.

పాత్రలకు జీవం.. నటనంటే ప్రాణం

- రంగస్థల వేదికపై పరిపూర్ణ నటుడు ప్రసాద్
- సాంఘిక నాటకాల్లో పలు పాత్రలతో గుర్తింపు
- ఉన్నవ వాసిని వరించిన కందుకూరి పురస్కారం

నాటకం సమాజాన్ని ప్రతిబింబించే అద్దం. అందులో తన రూపాన్ని నింపుకొంటూ సామాజిక బాధ్యతనే కథాంశంగా మార్చుకున్న కళాకారుడు వంకాయలపాటి చెన్నకేశవ ప్రసాద్. నాటకమంటే వల్లమాలిన ప్రేమ. తన జీవితాన్ని కళారంగానికే అంకితం చేశారు. తాజాగా కందుకూరి విశిష్ట పురస్కారాన్ని అందుకున్న ఆయనపై ప్రత్యేక కథనం ఇది.



మంత్రి కందుల దుర్గేష్ నుంచి కందుకూరి పురస్కారం స్వీకరిస్తూ...

యడ్లపాడు: యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామానికి చెందిన హిందీ ఉపాధ్యాయుడు లక్ష్మీ నారాయణ, ఆదిశేషమ్మ దంపతులకు చెన్నకేశవ ప్రసాద్ జన్మించారు. ఆరేళ్ల ప్రాయంలోనే నటనలో అరంగేట్రం చేసిన ప్రసాద్‌కు ప్రాథమిక గురువుగా చెన్నుపాటి వెంకటేశ్వర్లు వ్యవహరించారు. ఐ.రాజ్‌కుమార్ అభినయ నైపుణ్యాలు నేర్పించారు. అనంతరం డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు ప్రోత్సాహంతో నటుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. 2009లో 'ఆన్సర్'లో ప్రసాద్ నటనకు ఏపీ ప్రభుత్వం బంగారు నంది అవార్డు బహూకరించింది.

ఆకాశవాణిలోనూ..

27 సంవత్సరాలపాటు ఆకాశవాణిలో కళాకారుడిగా ప్రసాద్ సేవలందించారు. ఆయన గళం, సంభాషణ పలికే తీరు, భావం అన్నీ సమపాళ్లలో మిళితమై వినిపించేవి. చిన్నపాటి రేడియో నాటకాలు, ప్రత్యేక కార్యక్రమాల్లోనూ ఆయన స్వరం వినిపించగానే శ్రోతకు ప్రసాద్ గుర్తొచ్చేవారు. ఇలా రంగస్థలం వేదికపైనే కాకుండా ఆకాశవాణి, దూరదర్శన్, టీవీ సీరియల్స్, వెబ్ సిరీస్‌లోనూ నటించి ప్రతిభ చాటారు. ప్రసాద్ 1976లో గుంటూరు రీజినల్ ఇంటర్మీడియట్ కార్యాలయంలో టైపిస్టుగా ఉద్యోగంలో చేరారు. తరువాత ఇంటర్ కమిషనర్ కార్యాలయంలో బాధ్యతలు నిర్వహించారు. 2016లో పదవీ విరమణ చేశారు. అయినా నటనకు మాత్రం దూరం కాలేదు. నాటకరంగ ప్రముఖులైన నాయుడు గోపి, షేక్ షఫీ, మల్లాది శివ, కందిమళ్ల రాఘవ, సింగరకొండ చౌదరి, అమృతలహరి, పురుషోత్తం, మధిర సుబ్బరాజు తదితర ప్రముఖుల దర్శకత్వంలో వేర్వేరు పాత్రల్లో ప్రసాద్ నటించారు. తనదైన భాష, అభినయంతో ఆ పాత్రలకు వన్నె తెచ్చారు.

వరించిన పురస్కారాలు

ఉత్తమ నటుడు, విలన్, హాస్యనటుడు, క్యారెక్టర్ ఆర్టిస్టుగా వెయ్యికిపైగా పురస్కారాలను ప్రసాద్ సొంతం చేసుకోవడం ఆయన ప్రతిభకు నిదర్శనం. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి జిల్లా స్థాయిలో కందుకూరి పురస్కారాన్ని స్వీకరించారు. పల్నాడు జిల్లా స్థాయి కందుకూరి పురస్కారాన్ని ప్రసాద్ బుధవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ నుంచి తెలుగు నాటక రంగ అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాల కృష్ణ సమక్షంలో అందుకున్నారు.



రంగస్థల వేదికపై...

షూటింగ్ బాల్ జిల్లా జట్లు ఎంపిక



ఎంపికైన బాలురు, బాలికల జట్లతో హెచ్‌ఎం సోమనాథ్ తదితరులు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ బాల, బాలికల జిల్లా జట్ల ఎంపికలు సత్తెనపల్లి మండలం గుడిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగాయి. కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయుడు తోక సోమనాథ్ ప్రారంభించారు. ఎంపికకు బాలుర విభాగంలో 35, బాలికల విభాగంలో 30 మంది హాజరయ్యారు.

- బాలుర జట్టుకు ఎం.మణికంఠ, వి.వర్షిత్, ఎస్.భార్గవ్, జి.నాగ హనుమ, జి.వెంకటేష్, ఎస్. సుధీర్, జి.రంగా, బి గోపి, జి.సురేష్, ఎ.సూర్య, కె.శశి, శనగల భార్గవ్, స్టాండ్ బైలుగా కె. జోసఫ్, పి.ఆనంద్‌లు ఎంపికయ్యారు.
- బాలికల జట్టుకు పి.నందిని, ఎస్.సుస్మిత, ఎం.వీరలక్ష్మి, కె.ఉష, సీహెచ్ సంజన, ఎస్.సింధూర, పి.సులోచన రాణి, సి.చంద్రిక, కె.యశస్విని, ఎల్.మహాలక్ష్మి, కె.వేదవతి, ఎం. కీర్తన, స్టాండ్ బైలుగా ఎ.హేమ శివమణి, కె.వసంత కుమారి ఎంపికయ్యారు. ఈ క్రీడాకారులు ఈ నెల 25, 26వ తేదీలలో చిత్తూరు జిల్లా మదనపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని అసోసియేషన్ అధ్యక్షుడు మువ్వా నరసింహారావు, కార్యదర్శి కోనంకి కిరణ్ కుమార్ తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ఇవ్వాలి



వేణుగోపాల్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న ప్రతినిధులు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): ఎండ తీవ్రత దృష్ట్యా మే నెల అంతా అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ఇవ్వాలని, మినీ అంగన్‌వాడీ టీచర్లందరికీ మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా ఉద్యోగోన్నతి కల్పించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒ.లలిత, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్.సారమ్మ కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక అమరావతి రోడ్డులోని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యక్రమంలో కమిషనర్ వేణుగోపాల్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అంగన్‌వాడీల సమస్యలను విన్నవించారు. వృత్తిపరమైన ఇబ్బందులను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వాణిశ్రీ, అరుణ, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొంటున్నట్టు యూనియన్ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు నోటీసు కూడా కమిషనర్‌కు అందించినట్టు వివరించారు. సమస్యలపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్టు చెప్పారు.

చట్టబద్ధంగా రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి

ఆర్ అండ్ బీ అధికారులకు హైకోర్టు ఆదేశం



అమరావతిలోని క్రోసూరు రోడ్డు విస్తరణ పనులు నిర్వహిస్తున్న దృశ్యం

అమరావతి: పల్నాడు జిల్లాలోని అమరావతి – బెల్లంకొండ రోడ్డు విస్తరణ పనులు ఇటీవల రెండు నెలలుగా ధరణికోట, అమరావతి పరిధిలోని గ్రామాలలో చేపట్టారు. పలువురు గ్రామస్తులు అభ్యంతరం తెలిపినా ఆర్ అండ్ బీ అధికారులు ఇష్టారాజ్యంగా నోటీసులు, నష్ట పరిహారాన్ని ఇవ్వకుండానే భవనాలను, ఇళ్లను కూలుస్తున్నారు. కట్టా రాధికాదేవి సహా మరికొందరు అధికారుల వైఖరిపై హైకోర్టును ఆశ్రయించారు. ప్రక్రియను చట్టబద్ధంగా కొనసాగించాలని కోరుతూ పిటిషనర్ల తరఫున న్యాయవాది కోడె రమేష్ బుధవారం రిట్ పిటిషన్ దాఖలు చేశారు. విచారించిన హైకోర్టు న్యాయమూర్తి సత్తి సుబ్బారెడ్డి... ఆర్ అండ్ బీ శాఖ చట్టబద్ధంగా సర్వే నిర్వహించి, సంబంధికులకు నోటీసులు జారీ చేయాలన్నారు. చట్ట ప్రకారం ప్రక్రియను అనుసరించాలని ఆదేశాలు జారీ చేశారు. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వ న్యాయవాది బాలాజీని హైకోర్టు ఆదేశించింది. దీనిపై పలువురు ఇళ్ల యజమానులు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు చట్టబద్ధంగా వ్యవహరించాలని కోరారు. లేకుంటే పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు.

పోలీస్ స్టేషన్‌కు బేడీలా...!

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వైద్యుల విభాగ అధికార ప్రతినిధి



పిడుగురాళ్ల: దాచేపల్లి పట్టణంలోని పోలీస్ స్టేషన్‌కు బేడీలు వేయడమేంటని వైఎస్సార్ సీపీ రాష్ట్ర వైద్యుల విభాగ అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా మహిళా యాక్టివిస్ట్‌ను అరెస్టు చేసి అర్ధరాత్రి సమయంలో పోలీస్ స్టేషన్‌లో ఉంచటం సరైన నిర్ణయమా అని ప్రశ్నించారు. పార్టీ లీగల్ టీం, నాయకులు పోలీస్ స్టేషన్ లోపలికి వెళ్లకుండా బయట బేడీలు వేయడం హేయమైన చర్యగా ఆయన పేర్కొన్నారు. బాధితురాలిని లీగల్ టీం కూడా కలవకుండా అడ్డుకోవడం సిగ్గు చేటన్నారు. దీనిపై పల్నాడు జిల్లా ఎస్పీ, పోలీస్ ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. బాధ్యులైన పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

గుక్కెడు నీటి కోసం తప్పని కష్టాలు

- దొడ్లేరు గ్రామంలోని దండుబజారు వాసుల ఆందోళన
- ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారుల తీరుపై ఆవేదన



నీటి కోసం ఆందోళన చేస్తున్న మహిళలు

దొడ్లేరు(క్రోసూరు): గ్రామంలో వాటర్ ఓవర్ హెడ్ ట్యాంకులున్నా, చెరువులో నీళ్ల పుష్కలంగా వారికి గుక్కెడు నీరు మాత్రం రావడం లేదు. జలజీవన్ మిషన్ ద్వారా నీరు సరఫరా చేయాల్సి ఉన్నా పట్టించుకునే దిక్కే లేకుండా పోయింది. మండుటెండల్లో నీరు దొరక్క బజారులో బోరు పంపు వేయించేందుకు ప్రయత్నించగా పోలీసులను పిలిపించి అడ్డుకోవటంతో వారు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని దొడ్లేరు గ్రామంలోని దండుబజారు వాసుల దుస్థితి ఇది. ఇప్పటి వరకు వీధిలో ఉన్న బావి నుంచి నీరు తెచ్చుకునేవారు. బావి యజమాని ప్రస్తుతం వారిని రానీయటం లేదు. దీంతో వీధిలో బోరు పంపు వేసేందుకు గురువారం ఉపక్రమించారు. 20 అడుగులు తవ్వాక ఇంటి యజమాని ఒకరు తమ స్థలంలో బోరు వేస్తున్నారని ఫిర్యాదు చేయటంతో పోలీసులు వచ్చి అడ్డుకున్నారు. బోరు పంపు వేయనీయలేదు. దీంతో అక్కడి మహిళలు ఆందోళనకు దిగారు. గ్రామంలోని ప్రధాన రహదారిపై ఆందోళన చేశారు. పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని పోలీసులు నచ్చజెప్పారు.

వనరులున్నా నీరు ఇవ్వరు

పక్కనే చెరువు, నీళ్ల ట్యాంకు ఉన్నాయి. అయినా మా దండుబజారుకు మాత్రం నీరు రాక దాదాపు రెండు సంవత్సరాలైంది. అధికారులు, రాజకీయ నాయకులు పట్టించుకోవటం లేదు. ఓట్ల కోసం అందరూ వస్తారు. కానీ సమస్యను పరిష్కరించడంలో మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నారు. అధికారులు స్పందించి నీరు ఇవ్వాలి.

– దండు సైదా, దొడ్లేరు

బావి వద్దకు వెళ్తే అడ్డుకుంటున్నారు

మా బజారులో బావి వద్దకు కొందరు రానీయటం లేదు. పిల్లలు వెళ్తే దాడి చేస్తున్నారు. పెద్దలు వెళితే గొడవ పెట్టుకుంటున్నారు. మా డబ్బులతో బోరు పంపు వేయిస్తుంటే పోలీసులను తీసుకొచ్చి అడ్డుకున్నారు. మాకు నీరు ఎలా అందుతుంది? ఎలా బ్రతకాలి?

– షేక్ షాజిదా, దొడ్లేరు

వెంటనే నీరు సరఫరా చేస్తాం

దండుబజారులో తొలి నుంచి నీటి సమస్యలున్నాయి. పైపులు పగిలి కొంత, విద్యుత్ స్తంభాల మరమ్మతులు చేస్తుండగా పైపులు పగిలి మరొకసారి ఇబ్బందులొచ్చిన మాట వాస్తవమే. బావి వివాదంతో కూడా సమస్యలొచ్చాయి. తక్షణమే నీటిని సరఫరా చేసేందుకు పైపుల మరమ్మతు పనులు చేపట్టాం.

– వెంకయ్య, పంచాయతీ కార్యదర్శి

రైతుల దుస్థితిని కళ్లకు కట్టిన 'అన్నదాత'



అన్నదాత నాటికలో సన్నివేశం

తెనాలి: డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి స్మారక నాటక కళాపరిషత్, తెనాలి ఆధ్వర్యంలో ఇక్కడి రామలింగేశ్వరపేటలోని ఓపెన్ ఆడిటోరియంలో జరుగుతున్న జాతీయస్థాయి చతుర్థ ఆహ్వాన నాటికల పోటీల్లో భాగంగా ఆరో రోజైన గురువారం రెండు నాటికలను ప్రదర్శించారు. తొలుత కళాంజలి, హైదరాబాద్ వారి అన్నదాత నాటికను ప్రదర్శించారు. నేటి సమాజంలో రైతుల పరిస్థితిని కళ్లకు కట్టిందీ నాటిక. అప్పుల్లో కూరుకుపోతున్న రైతులు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కుంటున్న వర్తమాన స్థితిని ఎత్తిచూపింది. రైతాంగం మనుగడ ప్రశ్నార్థకం కావటం వ్యవసాయాధారిత దేశంలో ఓ గొప్ప విషాదంగా వర్ణించిందీ నాటిక. వల్లూరు శివప్రసాద్ రచించిన ఈ నాటికను కొల్లా రాధాకృష్ణ దర్శకత్వంలో ప్రదర్శించారు. వివిధ పాత్రల్లో శోభారాణి, సురభి ప్రియాంక, భుజంగరావు, పున్నయ్యచౌదరి, రాధాకృష్ణ, తిరుమల, శివరాం, ప్రశాంత్ నటించారు.

వినోదాన్ని పంచిన 'వర్క్ ఫ్రమ్ హోమ్'..

అనంతరం సహృదయ, ద్రోణాదుల వారి 'వర్క్ ఫ్రమ్ హోమ్' నాటికను ప్రదర్శించారు. నలభీముడిలా వంటల చేయగల దిట్ట అయిన సుధీర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా చేస్తూ వర్క్ ఫ్రమ్ హోమ్‌లో అటు వృత్తిపని, ఇంట్లోకి తరచూ వచ్చే చుట్టాలకు వంటలు చేస్తూ సతమతమైన వ్యవహారాన్ని ఆద్యంతం హాస్య సన్నివేశాలకు వినోదాత్మకంగా సాగిందీ నాటిక. చివరకు ఉద్యోగానికి రిజైన్ చూసి 'సౌమ్యలక్ష్మీ హోమ్ ఫుడ్స్' పేరుతో స్టార్టప్‌ను ప్రారంభిస్తాడు. కేకే భాగ్యశ్రీ మూలకథను అద్దేపల్లి భరత్‌కుమార్ నాటకీకరించగా, డి.మహేంద్ర దర్శకత్వం వహించి, ప్రధాన పాత్రలో నటించారు. ఇతర పాత్రల్లో కొత్త శివరాంప్రసాద్, ఆళ్ల హరిబాబు, షేక్ షఫీ ఉజ్మా, వి.నాగేశ్వరరావు, లహరి నటించారు. తొలుత యనమదల రీతిక శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన ఆహుతుల అభినందనలు అందుకుంది. తెనాలి కళాకారుల సంఘం నిర్వహణలో జరుగుతున్న ఈ నాటికల పోటీలను గౌరవాధ్యక్షుడు ఆరాధ్యుల కన్నా, అధ్యక్షుడు అద్దేపల్లి లక్ష్మణశాస్త్రి, కార్యదర్శి పిట్టు వెంకటకోటేశ్వరరావు పర్యవేక్షించారు.

గోవుల మృతిపై విచారణ చేపట్టాలి

చినకాకాని(మంగళగిరి): తిరుపతిలో గోవుల మృత్యువాతపై ప్రభుత్వం విచారణ చేపట్టి నిజాలు నిగ్గు తేల్చాల్సిందిపోయి మతాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ మంటలు సృష్టిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ధ్వజమెత్తారు. చినకాకానిలో జరుగుతున్న జనసేవాదళ్ శిక్షణ తరగతులకు హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ తిరుపతిలో లడ్డూ కల్తీ అయిందని చెప్పిన ప్రభుత్వం ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అర్థంపర్థం లేని వ్యాఖ్యలతో మతాల మధ్య చిచ్చుపెడుతున్నారని రామకృష్ణ మండిపడ్డారు. కేంద్రంలో ప్రధానిగా ఉన్న మోదీ 11 ఏళ్లలో హిందువులకు ఏం చేశారని ప్రశ్నించారు. మోదీ అధికారంలోకి వచ్చాక రూపాయి విలువ పడిపోయిందని విమర్శించారు. ప్రధాని అదానీ, అంబానీలకు దోచి పెట్టడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ మోదీ పాలనలో మహిళలపై దాడులు, లైంగిక దాడులు పెరిగిపోయాయన్నారు.

యువకుడి మృతిపై అనుమానం

తాడేపల్లి రూరల్: పల్నాడు జిల్లా నడికుడిలో రైలు కింద పడి మృతి చెందిన నంద్యాల జిల్లా దొర్నిపాడు మండలం, క్రిష్టపాడు గ్రామానికి చెందిన గద్దం ప్రవీణ్‌కుమార్(28)ది ఆత్మహత్య కాదని, ఏదో కుట్రకోణం దాగి ఉందని జాతీయ మానవ హక్కుల సంఘం వైస్ చైర్మన్ బి.వి.ఎస్.కృష్ణారెడ్డి, మృతుడి తల్లి సుగుణమ్మ గురువారం మంగళగిరి రూరల్ పరిధిలోని ఆత్మకూరులో డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాకు, విజయవాడ రైల్వే ఎస్పీ విజయ్‌రావుకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ విజయవాడలోని వెన్ సాయి పీవీసీ గ్రానైట్స్ కంపెనీలో మేనేజర్‌గా ప్రవీణ్‌కుమార్ పనిచేస్తున్నాడని, 2025 మార్చి 12న కార్యాలయం నుంచి వెళ్లిన ప్రవీణ్ మార్చి 13న పల్నాడు జిల్లా నడికుడి రైల్వేస్టేషన్ పరిధిలోని తుమ్మలచెరువు ట్రాక్‌పై మృతదేహమై కనిపించాడని, మృతుడికి ఆత్మహత్య చేసుకోవాల్సిన సమస్యలు లేవని పేర్కొన్నారు. ప్రవీణ్ ఉద్యోగం చేసే ప్రాంతం, మృతి చెందిన ప్రాంతానికి సుమారు 138 కిలోమీటర్ల దూరం ఉందని తెలిపారు. తోటి కంపెనీ ఉద్యోగులను విచారణ చేస్తే అసలు విషయం బయటకు వస్తుందని, నడికుడి రైల్వే ఎస్ఐ విచారణ వేగవంతం చేయడం లేదని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు దీనిపై పూర్తి విచారణ చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశామని తెలిపారు.

స్థలం వివాదంలో నిందితులకు జరిమానా, జైలు

అద్దంకిరూరల్: స్థల వివాదంలో ఆరుగురు ముద్దాయిలకు ఎస్‌జే కోర్టు జడ్జి జరిమానా, శిక్ష విధించినట్లు సీఐ సుబ్బరాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలు.. అద్దంకి మండలం మైలవరం గ్రామంలో 2020లో జరిగిన స్థల వివాదంలో అప్పటి ఎస్సై వీ.మహేష్ మన్నేపల్లి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు రిజిస్టర్ చేసి కోర్టులో ఫైల్ చేశారు. విచారణలో భాగంగా ముద్దాయిలైన ఉడుములపల్లి సోమయ్య, కొండనాగరాజు, కుడుములపల్లి పెదకోటయ్య, కుడుములపల్లి శ్రీనివాసరావు, కుడుములపల్లి కోటయ్య, కొండా చిరంజీవిలపై కేసు నిరూపణ కాగా గురువారం అద్దంకి ఎస్‌జే కోర్టు జడ్జి డీ. నాగ వెంకటలక్ష్మి ఒక్కొక్కరికి రూ.5వేలు జరిమానా, ఒక సంవత్సరం జైలు శిక్ష విధించారు.

రోడ్డు ప్రమాదంలో యువ రైతు మృతి

- పెద్దదిక్కు కోల్పోయిన కుటుంబం
- పెదకూరపాడులో విషాదఛాయలు



పెదకూరపాడు: ఆ కుటుంబానికి ఆ యువకుడే ఆధారం. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోవడంతో కుటుంబ భారం తనపై వేసుకుని చెల్లికి వివాహం చేశాడు. చదువు కూడా మానుకుని వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని నడుపుతున్నాడు. అలాంటి ఆ యువకుడిని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. దీంతో కుమారుడి మృతదేహం చూసి తల్లి అప్పుడే నిండు నూరేళ్లు నిండాయా.. అంటూ రోధిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. వివరాలు... పెదకూరపాడుకు చెందిన నర్రా హేమంత్ (29) ఈ నెల 12వ తేదీన సత్తెనపల్లి మండలం గుడిపూడి, సందిగామ గ్రామాల్లో జరిగిన అచ్చమాంబ తిరునాళ్లకు రాత్రి సమయంలో వెళ్లాడు. పెదకూరపాడు నుంచి నందిగామకు వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని జరిగిన రోడ్డు ప్రమాదంలో హేమంత్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, కుటుంబ సభ్యులు గుంటూరులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ హేమంత్ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు.

చిన్నతనంలోనే తండ్రి మరణం....

హేమంత్ చిన్నతనంలో తండ్రి కోటేశ్వరరావు మరణించారు. దీంతో కుటుంబ భారం తల్లి రాజేశ్వరిపై పడింది. తనతోపాటు తన చెల్లి బాధ్యతలు స్వీకరించిన హేమంత్ ఇంటర్ వరకు చదివి మానేశాడు. కుటుంబ పోషణ కోసం వ్యవసాయం ప్రారంభించాడు. ఈ క్రమంలో చెల్లి వివాహం చేసి, సొంత పొలంతోపాటు కౌలుకు కొంత పొలం తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. రోడ్డు ప్రమాదంలో హేమంత్ మృతి చెందడం ఆ కుటుంబానికి తీరని విషాదం మిగిల్చింది. చేతికొచ్చిన కుమారుడు మృతితో తల్లి రోధిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టిస్తోంది. హేమంత్ మృతితో పెదకూరపాడులో విషాదఛాయలు అలుముకున్నాయి.

స్వర్ణాంధ్ర నాటకోత్సవాలు ప్రారంభం



జ్యోతిప్రజ్వలన చేసిన దృశ్యం



శ్రీకృష్ణ తులాబారం నాటకంలో ఓ సన్నివేశం

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): బృందావన్‌గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం అన్నమయ్య కళావేదికపై ఏపీ ప్రభుత్వ సృజనాత్మకత, సంస్కృతి సమితి, భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ టీవీ, కళాంజలి క్రియేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం స్వర్ణాంధ్ర నాటకోత్సవాలు మొదలయ్యాయి. ఆలయ పాలక మండలి ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి పుట్టగుంట ప్రభాకరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, ఏపీ నాటక అకాడమీ నిర్వాహకులు గుమ్మడి గోపాలకృష్ణ, హంస అవార్డు గ్రహీత కావూరి సత్యనారాయణ, ఉగాది పురస్కారగ్రహీత నల్లక శ్రీనివాసరావు, టీవీ. నటుడు, నిర్మాత డాక్టర్ వలేటి అప్పారావు ప్రసంగించారు. ఈనెల 19 వరకు స్వర్ణాంధ్ర నాటకోత్సవాలు జరుగుతాయని కళారత్న డాక్టర్ చిట్టినేని లక్ష్మీనారాయణ తెలిపారు. అనంతరం శ్రీదుర్గాభవాని నాట్యమండలి (తెనాలి) ఆధ్వర్యంలో ఆరాధ్యుల ఆదినారాయణరావు నిర్వహణలో శ్రీకృష్ణ తులాబారం, పౌరాణిక పద్య నాటకం ప్రదర్శించారు. నటీనటులు మెప్పించారు. డోలక్‌పై సాంబిరెడ్డి చక్కటి సహకారాన్ని అందించారు.